క్లుప్తంగా

మంత్రి సబితారెడ్డికి శుభాకాంక్షలు



కందుకూరు: మదర్స్‌డేను పురస్కరించుకుని మంత్రి సబితారెడ్డిని మహేశ్వరం మండలం బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జగదీష్, శేఖర్, రాఘవేందర్, గోపాల్, రఘు పాల్గొన్నారు.

హిందూ ఏక్తా యాత్రలో నాదర్‌గూల్ నాయకులు



అందెల సమక్షంలో కరీంనగర్‌కు తరలుతున్న నేతలు

బడంగ్‌పేట్: కరీంనగర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తలపెట్టిన హిందూ ఏక్తా యాత్రకు బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున ర్యాలీగా కాషాయ శ్రేణులతో కలిసి అందెల కరీంనగర్ తరలివెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జంగయ్య, లక్ష్మణ్, మల్లేశ్, బీజేవైఎం యువకులు పార్టీ నాయకులు ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గాను ఈనెల 15 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మే 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రత్యక్ష తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఎస్‌ఎస్‌సీ మార్కుల లిస్టు, టీసీ, ఆధార్‌కార్డుతో పాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వనున్నామన్నారు. హైస్పీడు ఇంటర్‌నెట్ సదుపాయంతో కంప్యూటర్ ల్యాబ్, గూగుల్ ఈ–క్లాస్ రూమ్, రిటైల్ మేనేజ్‌మెంట్, టూరిజం, హాస్పటాలిటీ కోర్సులతో పాటు ఒకేషనల్ విద్య అందిస్తామన్నారురు. వివరాలకు సెల్ నంబర్లు 98497 46567, 96031 50011లో సంప్రదించాలన్నారు.

నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


కందుకూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ యాదగిరిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రక్త దాతలకు సర్టిఫికెట్ల అందజేత



ఎల్‌బీనగర్: మదర్ థెరిసా సొసైటీ నిర్వహించిన రక్తదాన కార్యక్రమాలలో రక్త దానం చేసిన దాతలకు ఆదివారం వనస్థలిపురంలో సర్టిఫికెట్లను అందజేశారు. రచయిత, కవి, ప్రొఫెసర్ డాక్టర్ కోటేశ్వరరావు,సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్, సభ్యులు శివశంకర్, సునీత పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన జజ్యాల సరోజమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నుంచి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.30 వేలు మంజూరయ్యాయి. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సరోజమ్మకు ఆ చెక్కును జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్ అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు చుక్క నిరంజన్‌గౌడ్, తల్లోజు రామకృష్ణ, సయ్యద్ ఖలీల్, విజయ్‌రెడ్డి, రమేశ్, వడ్డె వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, ప్రసాద్, ఆనంద్, శ్రీను, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అష్టకష్టాల ఆఖరి మజిలీ



కబ్జాకు గురై కుచించుకుపోయిన శ్రీరాం కాలనీ శ్మశానవాటిక



శ్మశానవాటికకు నోచుకోని జల్‌పల్లి శ్రీరాం కాలనీ

- ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలో తెలియని పరిస్థితి
- కబ్జాకు గురైన శ్మశానవాటిక
- జల్‌పల్లి శ్రీరాం కాలనీ వాసుల గోస

పహాడీషరీఫ్: పుట్టుక.. మరణం.. ఈ మధ్యలోని కాలమే జీవితం. అలాంటి జీవిత చివరి అంకమైన మరణం సంభవించినప్పుడు అశ్రునయనాల నడుమ గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం సహజం. కానీ జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని శ్రీరాం కాలనీలో ఎవరైనా చనిపోయారంటే ఎక్కడ అంత్యక్రియలు నిర్వహించాలన్న ఆందోళన మొదలవుతోంది. ఈ కాలనీలో శ్మశానవాటిక లేకపోవడమే ఇందుకు కారణం. ఇంట్లోని కుటుంబ సభ్యుడు చనిపోయాడన్న బాధ కంటే, అంత్యక్రియల అంశమే వారిని మనోవేదనకు గురిచేస్తుంది. 232 సర్వే నంబర్‌లో శ్మశానవాటికకు 2.5 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు స్థానిక ప్రజా ప్రతినిధులు చెబుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు.

25 వేల జనాభా ఉన్నా..

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వైకుంఠధామాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినా జల్‌పల్లి మున్సిపాలిటీలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఏకంగా 25 వేల జనాభా కలిగిన శ్రీరాం కాలనీలో శ్మశాన వాటికలు లేకపోవడంతో ప్రజలు అంత్యక్రియల నిమిత్తం వేలకు వేల రూపాయలు వెచ్చించి ఏకంగా పురానాపూల్‌కు వెళ్లాల్సి వస్తుంది. బంధు మిత్రులు, ఆప్తులు అంతదూరం వెళ్లలేక కొద్ది మందితో మాత్రమే ఆఖరి మజిలీ చేయాల్సి వస్తోంది. జల్‌పల్లి చెరువు వద్ద అంత్యక్రియలు నిర్వహించాలంటే మాత్రం పెద్ద ఎత్తున సిఫారసులు చేసుకోవాల్సి వస్తుంది. పైగా చెరువు పూర్తిగా నిండిపోవడంతో ఆ అవకాశం కూడా లేకుండా పోతుంది.

కుచించుకుపోయిన శ్మశానవాటికలు

ఒకప్పుడు జల్‌పల్లి పరిధిలో చిన్న పాటి క్వార్టర్స్‌తో మొదలైన శ్రీరాం కాలనీ ప్రస్తుతం భారీగా విస్తరించింది. 30 ఏళ్ల క్రితం ఈ కాలనీలో బీసీలకు రెండు శ్మశాన వాటికలను కేటాయించారు. ప్రస్తుతం ఇవి పూర్తిగా కబ్జాకు గురై కొన్ని సమాధులు మాత్రమే ఆనవాళ్లుగా మిగిలిపోయాయి. ప్రస్తుతం ఇక్కడ అంత్యక్రియలు సైతం నిర్వహించడం లేదు. ఈ శ్మశాన వాటికలకు ప్రహరీలు, మూత్రశాలలు, నీటి సదుపాయం లేదు. ఈ సదుపాయాలు కల్పించాలని గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. ఇదిలా ఉండగా హైదరాబాద్ మహానగర వ్యాప్తంగా ఉన్న పార్ధీ (నక్కల పిట్టలోల్లు)లలో ఎవరైనా చనిపోతే వారిని జల్‌పల్లి పిట్టలగూడెంలోని శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా పురానాపూల్ పార్ధివాడ నుంచి ఇక్కడికి అంత్యక్రియలకు భారీగా విచ్చేస్తుంటారు. అదే జల్‌పల్లి శ్రీరాం కాలనీలో చనిపోయి వారి అంత్యక్రియలేమో పురానాపూల్ శ్మశాన వాటికలో నిర్వహించాల్సి వస్తోంది. ఇలా జల్‌పల్లి శ్రీరాం కాలనీ ప్రజల అంత్యక్రియలు పురానాపూల్‌లో.. పురానాపూల్ పార్థీల అంత్యక్రియలను జల్‌పల్లిలో చేయడం పరిపాటిగా మారింది.

> **ప్రశాంతత లేదు**
>
> 
>
> శ్రీరాం కాలనీలో శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలన్న ఆలోచన వెంటాడుతోంది. మనిషి చనిపోయినప్పుడు ప్రశాంతంగా ఖననం చేసే పరిస్థితి లేకపోవడం బాధిస్తోంది. శ్రీరాం కాలనీలోని రెండు చిన్న శ్మశాన వాటికలకు ప్రహరీ లేదు. పిచ్చిమొక్కలతో నిండిపోయింది. అలాగే అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతోంది. – రవికుమార్, శ్రీరాం కాలనీ

వాకింగ్‌కు వచ్చి.. చెరువులో శవమై తేలి..

మీర్‌పేట: వాకింగ్ కోసమని ఇంట్లో నుంచి బయటకు వచ్చిన యువకుడు చెరువులో శవమై కనిపించిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మండలంలోని నందనవనం వాంబేకాలనీకి చెందిన షేక్ నూర్జహాన్ పెద్ద కుమారుడు షేక్ సలీం (22) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. సలీం కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతుండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పలుమార్లు అడిగినా సమాధానం చెప్పలేదు. కాగా ఈ నెల 5వ తేదీన సలీం రాత్రి 9.30 గంటలకు భోజనం చేసి వాకింగ్ కోసమని ఇంట్లో నుంచి బయటకు వచ్చి కనిపించకుండా పోయాడు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం జిల్లెలగూడ చందన చెరువులో గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండటాన్ని గమనించిన వాకర్స్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న నూర్జహాన్ చెరువు వద్దకు వచ్చి చూడగా మృతి చెందింది కుమారుడు సలీంగా గుర్తించింది. కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడుతూ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని తల్లి పోలీసులకు తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

పహాడీషరీఫ్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీలో ఆ పార్టీ నేతలు శనివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. షాహిన్ నగర్ నుంచి పహాడీషరీఫ్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నియోజకవర్గం నాయకుడు నర్సింహారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాణసంచా కాల్చుతూ.. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. మతతత్వ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీకి కర్ణాటక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కూడా కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమీర్ అలీ, సాధిక్ మహ్మద్, జహంగీర్ ఖాన్, అబ్దుల్ బారీ, ఉమర్ బహమెద్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ డీఎస్.చౌహాన్, తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: వ్యసనాలకు దూరంగా ఉండడంతోపాటు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ విద్యార్థులకు సూచించారు. మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 21వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు శనివారం రాత్రి జరిగాయి. సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలో కొంత మంది డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, సమయాన్ని వృథా చేయకుండా జీవితంలో ఎలా స్థిరపడాలన్న దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అందుకు కృషి చేసిన అధ్యాపకులకు కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి సీపీ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కళాశాల సెక్రటరీ హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ అమర్‌నాథ్‌రెడ్డి, తీగల అరుంధతి, తీగల తులసి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మన్సూరాబాద్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. 11కేవీ సిరీస్, హుడానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

స్థలం కేటాయించాలని మంత్రి సబితకు వినతి

మీర్‌పేట: నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ మీర్‌పేట సంఘం ప్రతినిధులు ఆదివారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 200 గజాల స్థలం, భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సంఘం మీర్‌పేట అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ తెలిపారు. అనంతరం సంఘం తరఫున మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, విజయ్ రాచకొండ, వెంకటేష్, డీ రామకృష్ణ, డీ రూప్‌కిరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీరప్పస్వామి కల్యాణం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి మల్లాపూర్‌లోని బీరప్పస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సబితారెడ్డి విచ్చేస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనగలరని ఆయన కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్తగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న సభ్యులు

హుడాకాంప్లెక్స్: సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ అసోసియేషన్ ఎన్నికలు సరూర్‌నగర్ వీఎంహోంలో ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ ఎన్నికలు ఫౌండర్ ప్రెసిడెంట్ ఏపీ రంగారెడ్డి, గౌరవ అధ్యక్షుడు టి.అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 100 మంది సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షుడిగా కొహెడ ప్రిన్సిపాల్ కేవీ చలపతి, ప్రధాన కార్యదర్శిగా హత్నూర్ కాలేజి ప్రిన్సిపాల్ వివేకానంద, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా భోనగిరి ప్రిన్సిపాల్ శ్రీరాం శ్రీనివాస్, ఉమామహేశ్వరి, బి.రమేష్‌బాబు, సునీత, శ్రీలత, సహ అధ్యక్షుడిగా ఏ వెంకటేశ్వర్లు, కోశాధికారులుగా దయాకర్, శ్రీనివాస్, సమ్మయ్య ఎన్నికయ్యారు. వీఎంహోం ప్రిన్సిపాల్ ప్రభుదాస్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే



కడ్తాల్: స్వీట్లు పంచుతున్న కాంగ్రెస్‌నాయకులు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆదివారం మండల పరిధిలోని మైసిగండిలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, రాజునాయక్, తులసీరాం, రమేశ్, సికిందర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ పాలనతో ప్రజలు విసుగెత్తారు..

తలకొండపల్లి: కేంద్రంలోని బీజేపీ పాలనతో ప్రజలు విసుగెత్తారని.. మార్పును కోరుకుంటున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాజాగా కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి.. ఎంతమంది ఎమ్మెల్యేలు గెలిస్తే అన్ని కొబ్బరికాయలు కొడుతానని ప్రభాకర్‌రెడ్డి గతంలో మొక్కుకున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ 136 మంది ఎమ్మెల్యేలతో విజయ దుందుభీ మోగించింది. దీంతో ప్రభాకర్‌రెడ్డితో, సర్పంచ్ శ్రీశైలం 136 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీటీసీ రాములు, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు విష్ణు, సర్పంచ్ శ్రీశైలం, జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



ఆమనగల్లు: హనుమాన్ పూజలో సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ కిషన్‌రెడ్డి

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తిలో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ స్వామి, శ్రీ జ్ఞాన సరస్వతి సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. నందివనపర్తి, ఎనెకిందతండా, అయ్యావారిగూడ తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందివనపర్తిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి, సమన్వయ మండలి సభ్యులు రామనాథం, అంజయ్య, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, యాదయ్య, నిఖిల్‌రెడ్డి, రుద్ర, కవిత తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామివారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, జగదీశ్, తరుణ్, మల్లేశ్, శ్రీమన్నారాయణ ఉన్నారు.

కొల్కులపల్లి గ్రామంలో..

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ కిషన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న చిలుక హైమావతి, ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ లో మదర్స్ డే సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి మాతృ మూర్తి చిలుక హైమవతి వచ్చే పెన్షన్ డబ్బుల నుండి మునగనూర్ గ్రామంలో సీఎస్‌ఎస్ సంస్థకు రూ. 25వేల చెక్కును ఆదివారం అందజేశారు. అందరూ సామాజిక భాధ్యతగా తమ వంతు సహాయం చేయాలని విజ్ఞప్తి చేసారు.

వరద ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జలమండలి జీఎం వినోద్

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని రేడియో కాలనీలో వరద ముంపు నివారణకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రేడియో కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జలమండలి జీఎం వినోద్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వర్షపు నీరు పోవడానికి సరైన వ్యవస్థ లేకపోవడంతో వరదనీరు కాలనీలో చేరి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. వర్షం నీరు పోవడానికి ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతు డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటులో భాగంగా ఔట్‌లైట్ పైపులైన్ వేయడానికి స్థలం ఇవ్వాలని స్థల యజమాని ముద్దగౌని సుమన్‌గౌడ్‌ను కోరడంతో ఆయన అంగీకరించారని అన్నారు. త్వరలోనే పనులు చేపట్టి కాలనీ సమస్యను పరిష్కరిస్తామని ఆయ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్, నాయకులు అజయ్ యాదవ్, కాలనీ అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు ‘గ్రంథాలయ’ నిర్మాణ పనులు



కొనసాగుతున్న నూతన గ్రంథాలయ భవనం పనులు

- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు
- రూ.కోటి ఇరవై లక్షలతో సకల సౌకర్యాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాఠకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తిచేసి ఈ నెలాఖరులోపు ప్రారంభించడానికి జిల్లా గ్రంథాలయ సంస్థ పాలకవర్గం సన్నాహాలు చేస్తోంది. ఆమనగల్లు పట్టణంలో దశాబ్దాల క్రితం నిర్మించిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠకులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, గత జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పాండురంగారెడ్డి చొరవ తీసుకుని రాష్ట్ర విద్యాశాఖామంత్రి సబితారెడ్డి సహకారంతో నూతన భవన నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా రూ.కోటి మంజూరు చేశారు. దీంతో గతేడాది రాష్ట్ర మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

శరవేగంగా పనులు...

గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు కావడంతో భవన నిర్మాణ పనులు చురుకుగా కొనసాగాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అసంపూర్తిగా ఉన్న పనులకు, ప్రహరీ నిర్మాణానికి నిధులు సరిపోకపోవడంతో ప్రస్తుత జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి అదనంగా రూ.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆయా పనులను కూడా పూర్తిచేస్తున్నారు. ఈ నెలాఖరులో భవనాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. భవన నిర్మాణ పనులకు ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు.

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా విజయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంకు చెందిన మైలారం విజయ్‌కుమార్ భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా నియామకమయ్యారు. ఆ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదీష్ ఈ మేరకు విజయ్‌కుమార్‌కు ఆదివారం నియామకపత్రం అందించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన వారి ఆశలు వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి, నీతినిజాయితీ, క్రమశిక్షణతో పార్టీ అప్పగించే ప్రతి పనిని పూర్తిచేస్తానని తెలి పారు. సహకరించిన ప్రతి ఒక్కరికి విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.